ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

శుక్రవారం 14 జూన్ 2024





మెగా డీఎస్సీపై హర్షం

- డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు
- ఉమ్మడి జిల్లాలో 2,500కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- నిరుద్యోగుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13:

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీని ప్రకటించడం పట్ల నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయనుంది. స్కూల్ అసిస్టెంట్లు 7,725, ఎస్జీటీలు 6,371, టీజీటీ 1781, పీజీటీ 286, ప్రిన్సిపల్స్ 52, పీఈటీ 132 పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,500కు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీని ప్రకటించలేదు. నిరుద్యోగ ఉపాధ్యాయులు ఉద్యోగాలపై ఆశలు వదులుకున్నారు. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీపై తొలి సంతకం చేయటం ఆనందంగా ఉంది. గత ఐదేళ్ల డీఎస్సీ కోసం కళ్ల కాయలు కాసేలా ఎదురు చూశాం. జగన్ ఒక్క డీఎస్సీ వేయకుండా ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ అంటు పోస్టులు లేకుండా విడుదల చేసి మా ఆశలపై నీళ్ల చల్లారు. ఐదేళ్ల కోచింగ్ తీసుకొని ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డాం. అయితే చంద్రబాబు మా బాధలను ఆలకించి మాకు ఇచ్చిన మాట మేరకు డీఎస్సీ విడుదలకు సంతకం చేయటం హర్షణీయం.

- బీ కేశమ్మ, డీఎస్సీ అభ్యర్థి, ఎమ్మిగనూరు



మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు



2019లో అధికారంలోకి వచ్చిన జగన్ డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి మాట ఇచ్చి తప్పారు. డీఎస్సీ అభ్యర్థులను మోసం చేశారు. ఎన్నో ఏళ్లగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తు వచ్చాం. ఇన్నేళ్లకు మా కలను చంద్రబాబు నెరవేర్చాడు. ఎన్నికలకు ముందు మాకు ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ విడుదల కోసం పెట్టడం హర్షణీయం. ఆయనకు కృతజ్ఞతలు

- మురళి, ఎమ్మిగనూరు.

జగన్ పాలనలో పాఠశాల విద్య పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కి.మీల దూరంలో ఉన్న అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 330కి పైగా పాఠశాలలు మూతపడ్డాయి. ఫలితంగా ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. పాఠశాలల విలీనంతో నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న పాఠశాలలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపలేక ఆర్థిక భారమైనా దగ్గరలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. దీంతో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య గణనీయంగా తగ్గింది. రేషనలైజేషన్ చేపట్టక ముందు జిల్లాలో మూడువేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు అవసరం ఉండేది. అయితే.. వైసీపీ ప్రభుత్వం విలీనం పేరుతో ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను తగ్గించింది. ఫలితంగా ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడింది. గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలల కిందట డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1541 పోస్టులు ఖాళీలు చూపించింది. డీఎస్సీకి సంబంధించిన టెట్ కూడా పూర్తి చేసింది. అయితే.. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా పరాజయం పొందింది. కొత్త ప్రభుత్వం భారీగా టీచర్ల ఖాళీలతో డీఎస్సీ ప్రకటించడంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన డీఎస్సీ హామీపై మొదటి సంతకం పెట్టడం పట్ల పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించినట్లంది. ఎంతో కాలం నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు టీచరు ఉద్యోగాలపై ఆశలు వదులుకుని ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. మరికొంత మంది ఎప్పటికైనా డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోతుందా అని వేలకు వేలు ఫీజులు చెల్లించి దీర్ఘకాలంగా కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఈసారి ఎలాగైనా కష్టపడి ఉద్యోగాన్ని సంపాదించాలనే కసితో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల జిల్లాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధ్యాయ నియామకాల భర్తీకి సంబంధించిన ప్రక్రియను శరవేగంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న కల నెరవేరబోతోంది. త్వరలో ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

మాట నిలబెట్టుకున్నారు



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఐదేళ్ళ నుంచి ఎదురు చూస్తున్నాం. ఎన్నికల స్టంట్‌లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా 6 వేల పోస్టులు భర్తీకి జగన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న చంద్రబాబు అధికారంలోకి రాగానే భారీ డీఎస్సీని విడుదల చేయడానికి తొలి సంతకం చేయడం సంతోషకరమైన విషయం.

-లక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, నంద్యాల

నిరుద్యోగుల ఆశలు నెరవేరబోతున్నాయి



నిరుద్యోగులు ఎన్నేళ్ళ నుంచో ఎదురు చూస్తున్న డీఎస్సీపై చంద్రబాబు మొదటి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగుల ఆశలు నెరవేరబోతున్నాయి. ఐదేళ్ళ వైసీపీ పాలనలో సచివాలయాల ఉద్యోగాలు తప్పితే జగన్ ప్రభుత్వం చేసిందేమీ లేదు.

-విజయానంద్, డీఎస్సీ అభ్యర్థి, నంద్యాల

చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టి మాట నిలబెట్టుకున్నారు. 16,347 పోస్టులను వదలడం అభినందనీయం. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా ప్రకటించారు. ఎన్నో ఏళ్లగా డీఎస్సీ కోసం సిద్ధపడుతూ వస్తున్నా.. ఎట్టకేలకు మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగుల ఆశలను చిగురింపచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మా కృతజ్ఞతలు.

- చిట్టిబాబు, డీఎస్సీ అభ్యర్థి, ఆదోని

తొలి సంతకం సంతోషకరం



సీఎంగా బాధ్యతలు చేపట్టిన మొదటి సంతకమే చంద్రబాబు మెగా డీఎస్సీపై సంతకం పెట్టడం చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టులు కూడా చాలా తక్కువ ఉన్నాయి. మెగా డీఎస్సీ వల్ల ఉపాధ్యాయులు కావాలన్న కోరిక నెరవేరుతుంది. **- సువర్ణ, ఆదోని**

జగనన్న కాలనీలో మోటారు మాయం

వైసీపీ నాయకుడి పొలంలో ప్రత్యక్షం



ఇస్కాల గ్రామంలో వైసీపీ నాయకుడి పొలంలో జగనన్న కాలనీ మోటారు

పాములపాడు, జూన్ 13 : గత ప్రభుత్వం జగనన్న కాలనీలో నీటి వసతిని కల్పించేందుకు ఏర్పాటు చేసిన బోరు మోటారు, పైపులను స్థానిక వైసీపీ నాయకుడు తన పొలంలో బిగించుకొన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరద నీటితో పంట భూమికి కోత

కొండవాగు నీటి ప్రవాహంతో మట్టి చేరి దెబ్బతిన్న అరటి పంట



పాణ్యం, జూన్ 13 : ఇటీవల కురిసిన భారీ వర్షానికి రాచెరువు సమీపంలోని కొండ వాగు నీరు పంట పొలాల్లోకి వెళ్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సుగాలిమెట్ట గ్రామానికి చెందిన రైతు దేవనాయక్ తన ఐదెకరాల పొలంలో అరటి పంటను సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి సమీప కొండల్లోని వాగు నీటి ప్రవాహం భారీగా రావడంతో దాదాపు అరడుగుల మేర మట్టి మేట వేసి పంట తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. గతంలో గాలేరు నగరి కాల్వ నిర్మాణంలేని సమయంలో కొండల్లోని వాగునీరు కాల్వ అవతలి వైపున ఉన్న వాగులోకి వెళ్ళేది. ప్రస్తుతం కాల్వ అడ్డంగా ఉండడంతో నీరు పంటభూముల్లోకి చేరుతోందని తెలిపారు. ఈ సమస్యను గాలేరు నగరి అధికారులకు తెలిపామని గ్రామస్థులు అన్నారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని దేవనాయక్ కోరారు. కాగా కాల్వ నిర్మాణం వల్ల తలెత్తిన సమస్య పరిష్కరిస్తామని జీఎన్ఎస్ఎస్ ఈఈ నాగరాజు ఆచారి తెలిపారు. పంట భూమిలోకి నీరు చేరకుండా కాల్వను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

చెప్పినట్లుగానే..!

- పింఛను పెంచిన టీడీపీ ప్రభుత్వం
- అవ్వాతాతలకు నెలకు రూ.4 వేలు
- మూడు నెలలది కలిపి రూ.7 వేలు
- వచ్చే నెల లబ్ధిదారుల ఖాతాలో జమ
- పింఛనుదారుల్లో సంతోషం

నంద్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి రాగానే పింఛను రూ.2 వేల నుంచి రూ.3 వేలు చేస్తాం' - 2019 ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను పెంచడానికి నాలుగేళ్ల తీసుకున్నారు.

'అధికారంలోకి రాగానే పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేస్తాం. ఏప్రిల్ నుంచే పింఛను పెంపు వర్తిస్తుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయగానే నెలకు వెయ్యి రూపాయల చొప్పున రావాల్సిన పింఛనుతో పాటు, రూ.4 వేలు కలిపి రూ.7 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం'. ఈ ఏడాది ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సీఎంగా పగ్గాలు చేపట్టగానే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంపు ఫైలుపై సంతకం చేశారు. పై రెండు ఘటనలను పరిశీలిస్తే.. ప్రజల బాగోగుల కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నేతకు, ప్రజలను మభ్యపెడుతూ ఐదేళ్లు పబ్బం గడిపిన నాయకుడికి తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ఇక పింఛను పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం వెయ్యి పెంచుతామని చెప్పి వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మభ్యపెట్టిందని, పైగా చంద్రబాబు నాయుడు పింఛను పెంచుతామని ఇచ్చిన హామీపై అవాకులు, చవాకులు పేలారని, హామీని నిలబెట్టుకోవటం ఎలాగో సీఎం చంద్రబాబును చూసి జగన్‌మోహన్‌రెడ్డి నేర్చుకోవాలని లబ్ధిదారులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలో లబ్ధి పొందనున్న 2 లక్షల 13 వేల మంది..

జిల్లాలో సామాజిక పింఛన్లు తీసుకునే వారు 213219 మంది ఉన్నారు. వీరిలో వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వంటి వారు ఉన్నారు. వీరందరికి వైసీపీ ప్రభుత్వం ప్రస్తుత సంవత్సరం నుంచి రూ.3 వేలు ఇస్తోంది. అయితే వీరికి హామీ ఇచ్చినట్లుగా టీడీపీ ప్రభుత్వం పింఛను వెయ్యి రూపాయలు పెంచుతూ రూ.4 వేలు చేసింది. ఈ పెంపును ఏప్రిల్ నెల నుంచే టీడీపీ వర్తింపజేయనుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చంద్రబాబునాయుడు ఈ ఫైలుపై సంతకం చేశారు. టీడీపీ ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే అమలు చేయటంతో పింఛనుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున నెలకు రూ.63 కోట్ల 96 లక్షలను అందజేస్తున్నారు. అయితే ప్రస్తుతం అదనంగా పెంచిన వెయ్యితో జిల్లాలోని ఆయా లబ్ధిదారులకు రూ.85 కోట్ల 28 లక్షలను ప్రభుత్వం అందజేయనుంది. అంటే ప్రస్తుతం అందిస్తున్న దానికంటే రూ.21 కోట్ల 32 లక్షలు పింఛనుదారులకు లబ్ధి చేకూరనుంది.

గతంలో హామీని మడతపెట్టిన వైసీపీ ప్రభుత్వం..

గత టీడీపీ ప్రభుత్వంలో సామాజిక పింఛను రూ.2 వేలు ఇచ్చేది. అయితే అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే పింఛను రూ3 వేలు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాటలు నమ్మి అధికారం కట్టబెట్టిన ప్రజలను సీఎం అయిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి వంచించడం మొదలుపెట్టారు. పింఛను ఒకేసారి రూ.3 వేలకు పెంచలేమని, విడతల వారీగా పెంచుతామని మాటమార్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రూ.250 పెంచి రూ.2250 ఇవ్వటం మొదలుపెట్టాడు. ఆ మొత్తాన్ని ఏడాదిపాటు అలాగే కొనసాగించి, ఆ మరుసటి ఏడాది మరో రూ.250 పెంచి రూ.2500 చేశారు. మళ్లీ 2023లో 2750 చేశారు. దీంతో లబ్ధిదారుల్లో జగన్‌పై నమ్మకం కోల్పోయారు. లేచింది మొదలు 'విశ్వసనీయత' అంటూ మాట్లాడే జగన్.. తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు నాలుగేళ్ల సమయం తీసుకోవడంలోనే ఆయన విశ్వసనీయత ఏపాటితో అర్థమయిందని పింఛను లబ్ధిదారులు తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు. ఇది గమనించిన జగన్ ఎన్నికల ఏడాది కావటంతో ఈ జనవరిలో పింఛను రూ.3 వేలు చేశారు. తాను చెప్పినట్లుగానే రూ.3 వేల పింఛను అందించానని ప్రగల్భాలు పలకడం మొదలుపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందుదామని చూశారు. అయితే జగన్ చేసిన మోసాన్ని పసిగట్టిన జనాలు, తాము మరోసారి మోసపోతున్నామని గ్రహించారు. మరోవైపు చంద్రబాబు పింఛను పెంపుపై నమ్మకంతో టీడీపీకి అధికారం కట్టబెట్టారు. పింఛనుదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చంద్రబాబు కూడా పింఛను పెంచారు.

పెంచింది చంద్రబాబే..

సామాజిక పింఛన్ల ఘనత తమ ప్రభుత్వం చలువే అన్నట్లు గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు ఊదరగొట్టే వారు. మళ్లీ అంతలోనే టీడీపీ ప్రభుత్వం రూ.వెయ్యి అందించేదని కానీ తాము మాత్రం రూ.2 వేల పైన అందిస్తున్నామని అబద్ధపు ప్రచారం చేసేవారు. అసలు వాస్తవమేమిటంటే రాష్ట్ర విభజన తర్వాత వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ.200 మాత్రమే ఉండేవి. 2014 జూన్ 19న వృద్ధాప్య పింఛన్లను ఐదు రెట్లు పెంచుతూ చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసింది. దీంతో పింఛను రూ.200 నుంచి రూ.1000కి పెరిగింది. దివ్యాంగులకు రూ.500 ఉన్నది కాస్త రూ.1500 అయింది. ఇక ఆ తర్వాత 2019 నుంచి వృద్ధాప్య పింఛన్లను రూ.2 వేలకు, దివ్యాంగుల పింఛనును రూ.3 వేలకు పెంచారు.

జగన్ జమానాలో కోతలే ఎక్కువ..

సామాజిక పింఛన్ల విషయంలో వైసీపీ చేసినదానికంటే, కోతలు పెట్టిందే ఎక్కువ! గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు రావాలంటే ఉన్న పింఛన్లను తొలగించేవారు. ఆరంచెల విధానంతో రకరకాల కొర్రీలు పెట్టి ప్రతి ఆర్నెల్లకు పింఛన్లు పొందేవారిని తొలగించేవారు. దీంతో ఏ నెల ఎవరి పింఛను తొలగిపోతుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందేవారు. ఇక దీనికి తోడు ఏదైనా అనివార్య కారణాల వల్ల లబ్ధిదారులు ఒక నెల పింఛను తీసుకోకపోతే ఆ నెల పింఛను కట్ అయ్యేది. ఇలాగే రెండు నెలల వరుసగా తీసుకోకపోతే పింఛను పూర్తిగా రద్దయేది. ఎక్కడైనా పింఛను తీసుకునే వెసులుబాటును కూడా వైసీపీ సర్కారు తీసేసింది. దీంతో లబ్ధిదారులు ఎక్కడున్నా ఒకటో తేదీ సొంత ఊళ్లో ఉండాల్సిన పరిస్థితి. కానీ 2014లో టీడీపీ ప్రభుత్వం సొంతూరిలోనే కాక ఎక్కడైనా పింఛను తీసుకునే వెసులుబాటునే కాక, వరుసగా రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెల కలిపి ఇచ్చేది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లిన వారికి ఎంతో వెసులుబాటు ఉండేది. ఇక ప్రస్తుతం పెంచిన పింఛను అదనపు సొమ్మును కిందటి మూడు నెలలది కూడా కలిపి మొత్తం రూ.7 వేలు వచ్చే నెల ఇవ్వనుండటంతో, 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో తాము ఎలాంటి లబ్ధి పొందామో, ఈ మారు కూడా అలానే జరుగుతుందని పింఛనుదారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పింఛనే పెద్ద దిక్కు



పెద్ద దిక్కులేని కుటుంబానికి పింఛనే ఒక పెద్ద దిక్కు. గురువారం నారా చంద్రబాబు నాయుడు పింఛన్ పెంపుపై సంతకం చేయడం ఆనందంగా ఉంది. జూలై నెలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలతో పాటు పెంచిన మొత్తం పింఛన్ రూ.7 వేలు అందజేస్తామని సీఎం చెప్పారు. మా జీవితాలకు పింఛన్ భరోసాగా నిలుస్తుంది.

-రసూల్‌బీ, పింఛన్ లబ్ధిదారు మిడ్తూరు గ్రామం

పెద్ద కొడుకులా ..



ప్రజల అభిమానంతో అధికారంలోకి వచ్చి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటిని పెద్ద కొడుకులా ఆదుకుంటాడని నమ్మకం ఉంది. రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడం ఎంతో ఆనందంగా ఉంది. మాటకు కట్టుబడి జూలై నెలలో రూ.7 వేలు చంద్రబాబు అందిస్తారు

- రోశమ్మ, పింఛన్‌దారు, శిరివెళ్ల

రక్తదాతలు.. ఆపద్బాంధవులు..

- సహకరిస్తున్న ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్), జూన్ 13:

ఇతరుల ప్రాణాలు నిలిపే అరుదైన అవకాశం రక్తదానం వల్ల కలుగుతుంది. దీన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి జిల్లాలో కొందరు యువకులు సమూహంగా ఏర్పడి రక్తదానం చేస్తున్నారు. ఇతరులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విరివిగా శిబిరాలు ఏర్పాటు చేస్తూ రక్తాన్ని సేకరిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు జిల్లాలో పని చేస్తున్నాయి. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల జీజీహెచ్, శాంతిరాం, విజయ బ్లడ్ బ్యాంకు, నంద్యాల బ్లడ్ సెంటర్, ఉదయానంద బ్లడ్ సెంటర్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు, ఆదోని జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు, కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు, న్యూలైఫ్, విశ్వభారతి హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు, ఆర్ ఆర్, అక్షయ బ్లడ్ బ్యాంకు, విశ్వభారతి పెంచికలపాడు, కర్నూలు బ్లడ్ సెంటర్, కేర్ బ్లడ్ సెంటర్, ఆదోని ఏడీపీ బ్లడ్ సెంటర్, గోవి చారిటబుల్ బ్లడ్ బ్యాంకు, మహాత్మా గాంధీ బ్లడ్ సెంటర్ ఎమ్మిగనూరులో బ్లడ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితో ఉమ్మడి జిల్లాలో 16 సీహెచ్‌సీల్లో బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు ఉన్నాయి.



రక్తదానానికి అర్హతలు ఇవే

- రక్తదాత వయస్సు 18 నుంచి 60 సంవత్సరాలలోపు ఉండాలి
- బరువు 45 కిలోలు ఉండాలి
- నాడి నిమిషానికి 60 నుంచి 100సార్లు కొట్టుకోవాలి
- వంద గ్రాముల రక్తంలో హెచ్‌బీ 12.5 శాతానికి పైగా ఉండాలి
- 3000 ఎంఎల్ మాత్రమే రక్తం సేకరించాలి

ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం



రక్త అవసరాలు తీర్చేందుకు దాతల్లో రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన, చైతన్యం తీసుకువస్తున్నాం. రెడ్‌క్రాస్ ద్వారా కర్నూలు జీజీహెచ్‌లో రక్తం అవసరాలు తీర్చేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా రక్తదాతలను ప్రోత్సహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి ఒక్కరూ బర్త్‌డే, పెళ్లి రోజులు, శుభకార్యాల సందర్భంగా రక్తం ఇవ్వడానికి సిద్ధం కావాలి. అమెరికా, యూరప్ దేశాల్లో అక్కడి ప్రజలు ప్రతి రెండు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుండగా.. మన దేశంలో 3, 4 నెలలకు ఒకసారి ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ఆదోని ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అధికంగా రక్తాన్ని ఇస్తున్నారు. - డా. కేజీ గోవిందరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, కర్నూలు

118 సార్లు రక్తదానం చేస్తున్నా



గత 38 సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నాను. 1987 ఢిల్లీలో ఓ గర్భిణికి సిజేరియన్ ఆపరేషన్ సందర్భంగా మొట్టమొదటి సారిగా రక్తదానం చేశాను. అప్పటి నుంచి ఇప్పటివరు 118 సార్లు రక్తదానం చేశాను. మా అబ్బాయి కోలా అమరగోపాల్ 25వ బర్త్‌డే సందర్భంగా 100వసారి రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో దానం చేశాను.

- కోలా గోపి, ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు, డోన్

తలసీమియా పిల్లలకు రక్తదానం చేస్తున్నా



ఇప్పటి వరకు 25సార్లు రక్తదానం చేశాను. 2014 నుంచి సేవా సమితి ద్వారా రక్తాన్ని అందించగలిగాను. ముఖ్యంగా తలసీమియా పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని ఇస్తున్నా. పసుపుల గ్రామానికి చెందిన ఓ తలసేమియా బాలికకు 22వసారి, ఓ గుండె రోగికి 19వసారి రక్తాన్ని దానం చేశారు.

- సి.రేణుక, యువ భారత్ సేవా సమితి సభ్యురాలు, కర్నూలు

సీపీడబ్ల్యూఎస్ స్కీములకు టెండర్లు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 60 సీపీడబ్ల్యూఎస్ స్కీముల నిర్వహణ, తాగునీటి సరఫరా కోసం కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కాంటాక్టర్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.ఈప్రొక్యూర్‌మెంట్.జీఓవి.ఇన్ లో లాగిన్ ద్వారా ఆన్‌లైన్ టెండరులో పాల్గొనవచ్చన్నారు. టెండర్‌లో పాల్గొనేందుకు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. అదే రోజుసాయంత్రం 4 గంటలకు సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, నంద్యాల డీఆర్‌ఈఓ పర్యవేక్షణలో ఆన్‌లైన్ టెండర్లను తెరుస్తామని అన్నారు.

యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిలో పురోగతి సాధించండి



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 13: జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపికైన చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్‌ల అభివృద్ధి అంశాలపై పురోగతి సాధించాలని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు సూచించారు. గురువారం ఢిల్లీ నుంచి నిర్వహించిన నీతి అయోగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డా.జి. సృజన తన చాంబర్ నుంచి పాల్గొన్నారు. చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్‌ల డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అభివృద్ధి అంశాలపై నీతి అయోగ్ సీఈవోకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. తదనంతరం చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్ డెవలప్‌మెంట్‌లకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలను సాచ్యురేషన్ మోడ్‌లో సాధించాలని నీత్ అయోగ్ సీఈవో కలెక్టర్‌కు సూచించారు. కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాల్గొన్న సీపీవో హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీజీ భరత్ మొదటి సారిగా కర్నూలుకు రానున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కాలేజీ వద్ద సాయంత్రం 4 గంటలకు ఘన స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ ఉంటుందని, నగర ప్రజలు, తెలుగుదేశం పార్టీ వార్డు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీ మున్సిపల్ ఆఫీసు, ఎస్‌బీఐ సర్కిల్, గాంధీనగర్, జిల్లా పరిషత్, రాజ్‌విహార్ మీదుగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగుతుందని తెలిపారు. .

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13: కర్నూలు ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్ డా.బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు కింద ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ జేలోని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ఆడిటోరియంలో నిర్వహించిన బహుజన రచయితల నాల్గవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఈ పురస్కారం తీసుకున్నారు. 8 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవీఈవో జమీర్‌పాషా, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆలూరు, జూన్ 13: ఆలూరు మండలం పెద్దహోతూర్ సమీపంలో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడి గొల్ల గుడ్డు లక్ష్మన్న (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పెద్దహోతూరు గ్రామం నుంచి ఆటో ఏపీ02టీసీ4393 నెంబర్ గల ఆటో ఆలూరుకు బయలు దేరింది. గ్రామ శివారు వద్ద వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో డ్రైవర్‌తో పాటు గుడ్ల గొల్ల లక్ష్మన్న, సోమ లింగమ్మ, గొల్ల సన్నీ, హనుమంతు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గొల్ల గుడ్డు లక్ష్మన్న (55) అక్కడికక్కడే మృతి చెందాడు. సోమలింగమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మృతుడు గొల్ల గుడ్డు లక్ష్మన్నకు భార్య లక్ష్మీ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబులేష్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మిడుతూరు, జూన్ 13: అప్పుల బాధ తట్టుకోలేక పింజరి మహమ్మద్ రఫి(35) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం దేవనూరు గ్రామానికి చెందిన పింజరి మహమ్మద్ రఫి తనకున్న రెండు ఎకరాల పొలంతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని మూడేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. వర్షాలు సకాలంలో కురవక పంట దిగుబడులు సరిగా రాలేదు. పెట్టుబడి కూడా చేతికి అందక కుటుంబ పోషణ భారమై రూ.10 లక్షల అప్పు చేశారు. అప్పులు చెల్లించలేక మనస్తాపనకు గురై మహమ్మద్ రఫి గురువారం తన ఇట్లో పురు గుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రైతు మరణించాడని వైద్యులు తెలపారు. తండ్రి నూర్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.

రైల్వే మహిళా కూలీపై చిరుత దాడి

మహానంది, జూన్ 13: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన పాండవ్ అనే మహిళపై చిరుతపులి దాడి చేసింది. గురువారం నల్లమలలోని గిద్దలూ రు-నంద్యాల రైల్వే ట్రాక్ పరిధిలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు కూలీలు చేస్తుండగా దాడి చేసింది. మిగతా కూలీలు కేకలు వెయ్యడంతో చిరుత పారి పోయింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయాలపాలైన ఆమెను తోటి కూలీలు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి అటవీశాఖ ఉన్నతాధికార్లు చేరుకొని చిరుతపులి కోసం నల్లమలలో అన్వేషించారు.

అన్నీ అసౌకర్యాలే

- విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూస్, సాక్సులు
- వర్షంతో చిత్తడిగా మారిన ప్రాంగణాలు
- ఒక పక్క నిర్మాణ పనులు, మరో పక్క తరగతులు
- బస్తాలు మోస్తూ కూలీలుగా మారిన విద్యార్థులు
- వేసవి సెలవుల తర్వాత మొదలైన పాఠశాలలు



బురదగా మారిన కర్నూలు నగరంలోని టౌన్‌మోడల్ స్కూల్ ప్రాంగణం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13: వేసవి సెలవులనంతరం గురువారం అన్ని యజమాన్యాల పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉరుకులు, పరుగులతో హుషారుగా కనిపించారు. మొదటి రోజు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పలుచగా కనిపించింది. రాత్రి వర్షం పడటంతో పాఠశాలల ఆవరణలు వర్షపునీటితో బురదగా మారాయి. ఒకపక్క పాఠశాలల ప్రాంగణాల్లో అదనపు తరగతి గదుల పనులు జరుగుతున్నాయి. కర్నూలు సీ.క్యాంపు సమీపంలోని నగర పాలక మున్సిపల్ హై స్కూల్‌లో ఈ సన్నివేశం కనిపించింది. ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో కర్నూలు మండల స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఆటోలను తీసుకువచ్చి విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్స్ మోయించారు. 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్ మినహా అన్ని పాఠ్య పుస్తకాలు వచ్చాయి. అలాగే 7వ తరగతి విద్యార్థులకు జనరల్ సైన్స్ తప్ప మిగతా టైటిల్స్ సరఫరా కాలేదు. 6వ తరగతి విద్యార్థులకు 4 టైటిల్స్ పెండింగ్‌లో ఉన్నాయి.



పాఠశాలకు వచ్చిన పుస్తకాలు మోస్తున్న విద్యార్థులు



భవన నిర్మాణాల పనుల వద్ద తిరుగుతున్న విద్యార్థులు





ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు

డిగ్రీలో ఆరుగురు డిబారు

కర్నూలు(అర్బన్), జూన్ 13: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2 వ సెమిస్టర్ పరీక్షలో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నంద్యాల, కర్నూలు జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 931 మంది పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకోగా 780 మంది హాజరయ్యారని తెలిపారు.

టయానికి రావాలని తెలియదా?

- ఎమ్మిగనూరు ఏఓపై సీఈఓ ఆగ్రహం
- పరిపాలన అధికారులతో సమీక్షా సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: జిల్లా పరిషత్‌లో సమావేశం ఉందని తెలుసుకుని కూడ టయానికి రావాలని తెలియదా? సమావేశానికి వచ్చావా? లేక ఏదైనా పని ఉండి వచ్చావా? అంటూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఎమ్మిగనూరు పరిపాలన అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ఉందని చెబితే...మధ్యాహ్నం 12.45 గంటలకు ఎలా వస్తావని ఏఓను ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల పరిపాలన అధికారులతో జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ వెంటకసుబ్బారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023-24 మండల పరిషత్ వార్షిక లెక్కలు, లోకల్ ఫండ్ ఆడిట్ అభ్యంతరాలు, ఎంపిటీసీల గౌరవ వేతనం, ఎంపిటీసీల ఖాళీల వివరాలు, 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం, బీపీడీపీ, కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాల గురించి మండలాల వారిగా సమీక్షించారు. వార్షిక లెక్కలను కూడ సమర్పించని ఏఓలను సీఈఓ సున్నితంగా దండించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 14 మండలాలు 15 ఆర్థిక సంఘం నిధులను సరిగ్గా వినియోగించలేదని అన్నారు. నిధులు లేక అల్లాడుతుంటే ఉన్న నిధులను ఎందుకు ఖర్చుచేయలేదని ఏఓలను ప్రశ్నించారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం సకాలంలో ఇవ్వకుంటే ఎంపీడీఓల జీతాల నుంచి రికవరీ చేస్తానని హెచ్చరించారు. ఆడిట్ అభ్యంతరాలపై కొందమంది పరిపాలన అధికారులకు అవగాహన లేదని అన్నారు. ఆడిట్‌కు వచ్చే అభ్యంతరాల పేరాలను త్వరితగతిన జిల్లా పరిషత్ అకౌంట్ సెక్షన్‌లో సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిపాలన అధికారులు సి. మురళీమోహన్‌రెడ్డి, సి. రాంగోపాల్, జితేంద్ర, సరస్వతి, బసవశేఖర్, సౌభాగ్యలక్ష్మి, మండలాల పరిపాలన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ జి. నాసరరెడ్డి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఐదు హామీలపై చంద్రబాబు సంతకం చేయడం పట్ల గౌరు చరిత హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

కల్లూరు, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గురువారం క్షీరాభిషేకం చేశారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ప్రజలకు ఇచ్చిన ఐదు హామీలపై నారా చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గౌరు చరిత మాధవీనగర్‌లోని తన స్వగృహంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రధానమైన ఐదు ఫైళ్లపై సీఎం నారా చంద్రబాబునాయుడు సంతకం చేయడం ఆనందంగా ఉందన్నారు. మోగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దు, పింఛన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్‌పై చంద్రబాబు సంతకాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొలను సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీరాములు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోగా డీఎస్సీ ఫైలుపై సంతకం పట్ల హర్షం: ఏపీ సీఎంగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మోగా డీఎస్సీ ఫైలుపై తొలి పంతకం చేపడం పట్ల కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌చాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.



సంబరాల్లో టీడీపీ నాయకులు

'విద్యార్థుల సంఖ్య పెంచాలి'



భూపనపాడులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాణ్యం, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యపెంచాలని పాణ్యం ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని భూపనపాడు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను ఆమె గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా విధిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని, స్కూల్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో 31 మంది విద్యార్థులున్నారని, వారి సంఖ్య మరింత పెంచాలని హెచ్ఎం హుశేన్‌సాహెబ్‌ను కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో కోటయ్య, ఉపాధ్యాయురాలు గాయత్రిబాయి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ప్రజా పాలన'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 13: రాష్ట్రంలో కూటమి విజయంతో ప్రజా సంక్షేమ పాలన చంద్రబాబు అందించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు హుసేన్ రెడ్డి, కోదండ రామిరెడ్డి, జాని అన్నారు. నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచిన ఎన్ఎండీ ఫరూక్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో చంద్రబాబు నాయుడు స్థానం కల్పించడంతో 28వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గురువారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మానసిక వికలాంగుల కేంద్రంలో, సెయింట్ లుక్స్ అంధుల వసతి గృహంలోని అంధులకు అన్నదానం చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన టీడీపీ కూటమితో నే సాధ్యమవుతుందని ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నంద్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు. ఎద్దుల ప్రవీణ్‌కుమార్, ఇషాక్‌బాషా, చర్చిల్, తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.20.92 లక్షల ఆదాయం

మహానంది, జూన్ 13: మహానంది లో భక్తుల వసతి కల్పనలో భాగంగా గురువారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.20,92,1400 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయ పరిధిలోని పోచా విశ్రాంతి భవనంలో మహానంది దేవస్థానానికి చెందిన 75 ఎకరాల 62 సెంట్ల మాన్యం భూములకు మూడు సంవత్సరాల కౌలు కాల పరిమితి కింద బహిరంగ వేలం నిర్వహించగా రూ.14,32,900 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే కరివేన బ్రాహ్మణ సత్రం ఎదురుగా హోటల్ నిర్వహించుకొనేందుకు మహానందికి చెందిన గంగిశెట్టి రవణమ్మ నెలకు రూ.2,01,500 బాడుగ చెల్లించేందుకు హెచ్చుపాట పాడినట్లు తెలిపారు. అదేవిధంగా జిందాల్ సంస్థ నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ హక్కుకు సంబంధించి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.4.50 లక్షలకు మహానందికి చెందిన స్వప్నకుమారి హెచ్చు పాట పాడినట్లు ఈవో చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమల్లయ్య పాల్గొన్నారు.

'ఇంటర్మీడియట్ తరగతులు కొనసాగించాలి'

ఆత్మకూరు, జూన్ 13: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు కొనసాగించాలని ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం ప్రారంభమై 14రోజులు కావస్తున్నా ఇంతవరకు తరగతులు నిర్వహించ లేదని అన్నారు. అలాగే ప్రతి గ్రూపునకు సంబంధించి అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.అదేవిధంగా తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమయ్యే ఫర్నీచర్‌ను సమకూర్చాలన్నారు. సమావేశంలో సాయి, దిలీప్, చందు తదితరులు ఉన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకుడు నాగరాజు

శ్రీశైలం, జూన్ 13: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం బాపట్లకు చెందిన వి. సతీష్ రమ్యకృష్ణ అనే భక్తుడు రూ. 1,16,116 లను విరాళంగా అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

'న్యాయం చేయాలి'

కొత్తపల్లి, జూన్ 13: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఇనర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని సూపర్‌వైజర్ శాలి సాహేబ్, సేల్స్‌మెన్లు మధుబాబు, వెంకట లింగమయ్యలు కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 18వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దుచేసి పాత పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే మద్యం దుకాణాల్లో పని చేస్తున్న వారికి విద్యార్హత, సీనియారిటీ పరిగణనలోకి తీసుకుని మరో డిపార్టుమెంటుకు సేవలను వినియోగించుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాచ్‌మెన్లు హుశేన్ మియా, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్న క్యాంటీన్లు వచ్చేస్తున్నాయ్

- పునఃప్రారంభానికి ఏర్పాట్లు
- శుభ్రం చేయిస్తున్న అధికార యంత్రాంగం



నంద్యాలలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల టౌన్, జూన్ 13: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో అన్న క్యాంటీన్‌ల పునః ప్రారంభానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 2014 -2019 టీడీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రూ.5కు అల్పాహారం, రూ.5కు భోజనం పేదలకు అందించేందుకు ఈ క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. వీటి కోసం శాశ్వత భవనాలను నిర్మించారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ క్యాంటీన్‌లను మూసి వేసివేశారు. దీనిపై ప్రజల్లో వైసీపీ వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటిన్లను తెరచి పేదల ఆకలి తీర్చుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. తిరుగులేని మెజార్టీతో టీడీపీ - జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. గురువారం సీఎం చంద్రబాబు నాయుడు సెక్రటేరియేట్‌లో మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై నాల్గవ సంతకం, నైపుణ్యం గణనపై ఐదో సంతకం చేశారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అన్న క్యాంటీన్ల పునః ప్రారంభానికి క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నంద్యాలలో మూతపడిన శాశ్వత భవనాలను తెరిపించి శుభ్రం చేస్తున్నారు. చురుగ్గా జరుగుతున్న పనులను కమిషనర్ నిరంజన్‌రెడ్డి, పారిశుధ్యం విభాగం అధికారి ప్రసాద్‌రెడ్డి, వార్డు సచివాలయ పారిశుధ్య అధికారి జైనుల్లా ఉద్దీన్ తదితరులు పర్యవేక్షించారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో ఆనాడు అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనాన్ని వైసీపీ ప్రభుత్వం వార్డు సచివాలయంగా మార్చింది. చంద్రబాబు సీఎంగా అధికారంలోకి రాగానే తిరిగి అదే భవనాన్ని నేడు అన్న క్యాంటీన్‌గా మార్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం అక్కడ నిర్వహిస్తున్న వార్డు సచివాలయం 06ను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు: డీఏవో

నంద్యాల టౌన్, జూన్ 13: జిల్లాలో ఎరువుల హోల్ సేల్ వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, అక్రమాలకు, అక్రమార్జనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. గురువారం పలు ఎరువుల హోల్‌సేల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ రిటైల్ డీలర్లకు హోల్‌సేల్ వ్యాపారులు సక్రమంగా ఎరువులను సరఫరా చేయాలని, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రిజిస్టర్లు, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లుగా చూసుకోవాలని, గోడౌన్ ప్రకారం స్టాక్ రిజిస్టర్‌లను నిర్వహించాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించకూడదని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా వెంకట శివసాయి ఫర్టిలైజర్స్‌లో ఎరువుల నిల్వలు, స్టాక్ బుక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఇతర ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏడీఏ రాజశేఖర్, ఏవో ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

'పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి'



నంద్యాలలో అంగన్‌వాడీ బాట-బంగారుబాట కార్యక్రమంలో తల్లులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గోపవరంలో బడిబాటపై ర్యాలీ నిర్వహిస్తున్న తల్లిదండ్రులు

నంద్యాల కల్చరల్, జూన్ 13: అంగన్‌వాడీ చదువు భవిష్యత్తుకు పునాది వంటిదని, పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని నంద్యాల ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ సూచించారు. అంగన్‌వాడీ బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం నంద్యాలలో గురువారం పట్టణంలోని 2,3 సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ బాట-బంగారు బాటపై తల్లులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల తల్లులు మాట్లాడుతూ అంగన్‌వాడీ లలో పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలతో, విద్య ను అందించే అంగన్‌వాడీ కేంద్రాలలలో మూడేళ్లు నిండిన చిన్నారులను చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీలో 5 సంవత్సరాలు నిండిన చిన్నారులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీరా, ఎఎన్ఎం శశికళ, అంగన్‌వాడీ టీచర్లు జమ్రుత్‌బేగం, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మూడేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రల్లోనే చక్కని విద్యాబుద్ధులు నేర్చుకొనే వీలు కల్గుతుందని గోపవరం అంగన్ వాడీ కేంద్రం నిర్వాహకురాలు ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం మహానంది మండలం గోపవరం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో పాటు తల్లితండ్రులతో ఆమె ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలు దాటిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాల్సిన బాధ్యత తల్లితండ్రులు తీసుకోవాలన్నారు. అనంతరం పరిశుభ్రతపై ఆమె చిన్నారులకు అవగాహన కల్పించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అబ్బీపురం, గాజులపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహకులు సావిత్రి, నారాయణమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

'పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి'



మాట్లాడుతున్న ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు, జూన్ 13: ప్రజలు శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలని ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణం ఆదేశించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయా మతాల పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. సీఐలు మాట్లాడుతూ పండుగలను అన్ని వర్గాల ప్రజలు మతసామరస్యంతో సంబరంగా చేసుకోవాలే తప్ప వివాదాలకు దారితీసే విధంగా ఉండకూడదని అన్నారు. ఏదైనా సున్నితమైన విషయాలు చోటుచేసుకున్నప్పుడు పెద్దలు వాటిని సవరించాల్సిన బాధ్యత వుందని గుర్తుచేశారు. ఆత్మకూరు ప్రాంతం ప్రశాంతతకు నిలయమని, ఇక్కడ హిందూ, ముస్లిం సోదరభావంతోకలిసి ఉండటం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని పండుగలను ఐక్యమత్యంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

నందికొట్కూరు: శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ సూచించారు. నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, హిందూ మత పెద్దలతో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు సొదీ చాంద్, గని, అబూబకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'టీకా తప్పనిసరి'

పాములపాడు, జూన్ 13: నేటి సమాజంలో క్షయవ్యాది రాకుండా ప్రతి ఒక్కరూ ముందస్తుగా ఈ బీసీజీ టీకాను వేయించుకోవాలని మండల వైద్యాధికారి నాగలక్ష్మి సూచించారు. మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. వైద్యాధికారి మాట్లాడుతూ 60ఏళ్లు పైబడిన వారు, షుగర్ పేషెంట్లు, పొగ తాగేవారు, పోషకాహార లోపం ఉన్నటువంటివారు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలన్నారు. మండలంలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు ఉచితంగా వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ముర్తుజాబీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జూన్ 13: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద ఉన్న దత్తాత్రేయ స్వామికి లోక కల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

'హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందాం'

ఆత్మకూరు, జూన్ 13: హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందామని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ దాసరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు.రు. ఆత్మకూరులోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో 16వ విడత ఇంటింటి ధర్మ ప్రచార కరపత్రాలను గురువారం వారు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ధర్మప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా పౌర్ణమి హారతి, ఏకాదశి నగర సంకీర్తన, సత్సంగం, భజనలు జరపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా హిందూ ధర్మం గురించి ప్రజలకు వివరించి చైతన్యం కలిగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు భానుమూర్తి, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, రమేష్ ఆచారి, నాగలింగమయ్య, మల్లయ్య, లక్ష్మణ్, వెంకటేష్ గౌడ్, కిరణ్ యాదవ్, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య నాయకుడిపై కర్రలతో దాడి

ఆత్మకూరు, జూన్ 13: పట్టపగలే నడిరోడ్డుపై ఆర్యవైశ్య సంఘం నాయకుడి పువ్వాడి భాస్కర్‌పై కొందరు వ్యక్తులు దాడిచేసిన ఘటన గురువారం ఆత్మకూరు పట్టణంలో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పువ్వాడి భాస్కర్ బస్టాండ్ వద్ద పండ్లు కొనుగోలు చేసి బైక్‌పై ఇంటికి వెళ్లే క్రమంలో కొందరు అతని బైక్‌ను అడ్డగించి కిందపడేలా చేశారు. ఆ తర్వాత పట్టు కర్రలతో దాడి చేశారు. అక్కడి నుంచి ఆయన తప్పించుకునే ప్రయత్నం చేయగా అంతటితో ఆగకుండా వెంటపడి మరీ నడిరోడ్డుపై కిందపడేసి కర్రలతో అతికిరాతంగా దాడికి పూనుకున్నారు. చివరకు అక్కడున్న కొందరు అడ్డుకోవడంతో ఆ వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వలి, మురళీ అనే వ్యక్తులతో పాటు మరికొందరు దాడి చేసినట్లు బాధితుడు పువ్వాడి భాస్కర్ ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయనున్నట్లు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

ఎల్ఈడీ స్ర్కీన్ అపహరణ

పగిడ్యాల, జూన్ 13: మండల పరిధిలోని పడమర ప్రాతకోట జెడ్పీ పాఠశాలలో గురువారం చోరీ జరిగింది. పాఠశాలలోని 10వ తరగతి గదిలో ఏర్పాటు చేసిన రూ. 1.20 లక్షల విలువ చేసే ఎల్ఈడీ స్ర్కీన్(ఐఎఫ్‌పీ) పరికరాన్ని దుండగులు అపహరించుకుపోయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణమ్మ తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం అవుతుండటంతో స్కావెంజర్ రాజేశ్వరి బుధవారం సాయంత్రం తరగతి గదులను శుభ్రం చేసి గదులకు తాళాలు వేసుకొనిపోయిందన్నారు. గురువారం ఉదయం పాఠశాలకు చేరుకున్న రాజేశ్వరి తరగతి గదులను తెరువబోగా గేటుకు వేసిన తాళం పగలగొట్టి ఉండటం, ఇసుప కడ్డీలు ఒరగడంతో అనుమానం వచ్చి తరగతి గదిని పరిశీలించగా అందులో ఐఎఫ్‌పీ స్ర్కీన్ పరికరం కనబడకపోవడంతో ఉపాధ్యాయులకు సమాచారాన్ని చేరవేసిందన్నారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న హరి 15 రోజుల కిందటే తాను విధులకు రాలేనని చెప్పాడని ఆమె అన్నారు. ఈ చోరిపై ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సువర్ణమ్మ తెలిపారు.

మంత్రులను కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా



మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూన్ 13: రాష్ట్ర మంత్రులుగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన పలువురు మంత్రులను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులుగా తమ శాఖ తరుపున సుపరిపాలన అందించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ నాయకుడు యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకోను

- మున్సిపల్ అధికారుకు ఎమ్మెల్యే జయసూర్య హెచ్చరిక



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

నందికొట్కూరు, జూన్ 13: కొందరు వ్యక్తులకు అంటకాగే విధంగా ఉంటూ ఖజానాకు నష్టం వాటిల్లే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని గిత్తా జయసూర్య మున్సిపల్ ఉద్యోగులను హెచ్చరించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి నివాసంలో గురువారం ఎమ్మెల్యేను మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజు మీరు ఏమి చేశారో తమకు తెలియదని, అయితే ఇక నుంచి కొందరు వ్యక్తులకు అంటకాగే పనులు చేస్తామంటే ఇక్కడి నుంచి వెళ్లి పోవచ్చని ఎమ్మెల్యే మున్సిపల్ ఉద్యోగులను హెచ్చరించారు. ఇక్కడే కొనసాగుతూ గతంలోలాగే ఉంటూ ఖజానాకు గండికొట్టే విధంగా ఉంటూ ప్రజలకు నష్టం వాటిల్లే పనులు చేస్తే సహించబోమన్నారు.

'చంద్రబాబుపై యువతకు నమ్మకం'



థ్యాంక్యూ సీఎం అంటూ చంద్రబాబు చిత్రపటంతో యువకులు

వెలుగోడు, జూన్ 13: బాబు వస్తే జాబు కచ్చితంగా వస్తుందన్న నమ్మకం యువతలో ఉందని టీడీపీ యువ నాయకులు సర్ఫరాజ్, సుఫియాన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు డీఎస్సీపై తొలి సంతకాన్ని పెట్టడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఐదు అంశాలపై బాధ్యతలు చేపట్టిన వెంటనే సంతకాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం థ్యాంక్యూ సీఎం సార్ అంటూ చంద్రబాబు ఫ్లెక్సీని పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు.

పుస్తకాల పంపిణీ

కొత్తపల్లి, జూన్ 13: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేసినట్లు కొత్తపల్లి ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. గురువారం ఆయన కొత్తపల్లి ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ఐదు జిల్లా పరిషత్ హై స్కూళ్లకు, ఒక కస్తూర్బా పాఠశాలకు, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలకు, 37 ఎలిమెంటరీ పాఠశాలలకు వందశాతం పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఒక వారంలోపు యూనిఫాం, షూస్, స్కూల్ బ్యాగ్స్ కూడా ప్రభుత్వం విడుదల చేస్తుందని, వచ్చిన వెంటనే పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు.

ఆత్మకూరురూరల్ : పాఠశాలల వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలను గురువారం పునః ప్రారంభించినట్లు ఎంఈవో-2 సురేష్ తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేస్తునట్లు తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఉర్దూ పాఠశాల భవనంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, కస్తూర్బా పాఠశాలలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వందశాతం పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. ముందుగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, మరో వారంలో యూనిఫాం, షూస్, స్కూల్ బ్యాగ్స్ కూడా ప్రభుత్వం విడుదల చేస్తుందని వచ్చిన వెంటనే పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో వెల్లడించారు.

ఘనంగా పునీత ఆంథోని స్వామి పండుగ



పునీత ఆంథోని స్వామి గ్రామోత్సవం

నంద్యాల కల్చరల్, జూన్ 13: నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో పునీత అంథోని పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు అధ్యక్ష పీఠాధిపతి గోరంట్ల జ్ఞానేష్, మేరీమాత ప్రావిన్స్, విజయవాడ మరియదాసు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో విచారణ గురువులు, పాదర్ కిషోర్, సహాయ గురువు ఏసుపాదం, యువతులు, సంఘం పెద్దలు, మర్యాదల సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

పగిడ్యాల, జూన్ 13: మండలంలోని నెహ్రూనగర్‌కు చెందిన చెరుకు స్వాములుపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గురువారం రాత్రి స్వాములపై ఆయన ఇంటికి గొడ్డలితో తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన స్వాములును కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెద్ద తిక్కస్వామి అనే వ్యక్తి దాడి చేసినట్లు స్వాములు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

బీసీకి మంత్రి పదవిపై సంబరాలు

కోవెలకుంట్ల, జూన్ 13: బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి మంత్రి పదవి రావడంతో కోవెలకుంట్ల పట్టణంలోని న్యూటైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్‌హుసేన్ ఆధ్వర్యంలో గురువారం టైలర్లు కేక్ కట్ చేసి సంబ రాలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ బీసీ జనార్ధనరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం వల్ల బనగానపల్లె నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

సంజామల: మండలంలోని కానాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తిరుపతి వెంకన్నకు గురువారం మొక్కులు తీర్చుకున్నారు. తమ నాయకుడు బీసీ జనార్ధన్ రెడ్డిని మంత్రి పదవి వరిస్తే తిరుపతికి కాలినడకన వెళ్తామని మొక్కుకుని గురువారం తిరుపతిలో కాలిబాటన మెట్లమార్గంలో వెళ్ళారు. గ్రామ టీడీపీ నాయకులు శేషారెడ్డి ఆధ్వర్యంలో సాగర్‌బాబు, నారాయణ రెడ్డి, గుండం చంద్రశేఖర్ రెడ్డి, శోభశివుడు, నాగూర్‌భాషా, వలి, దేవేంద్రలు కాలిబాటన తిరుపతికి వెళ్ళి అక్కడ వెంకన్నను దర్శించుకున్నారు. చంద్రబాబు 5 ఏళ్ళపాటు రాజ్యం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని వెంకన్నకు మొక్కుకున్నట్లు శేషారెడ్డి పేర్కొన్నారు.

● బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి మంత్రి పదవి రావడంతో గురువారం సంజామల మండలం ముదిగేడు గ్రామంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామ టీడీపీ నాయకులు సోముల రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని దస్తగిరి స్వామి దర్గా వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చారు. అనంతరం భారీ కేక్ కట్‌చేశారు. నియోజకవర్గ మైనార్టీ ఉపాధ్యక్షుడు పసుపల మహమ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రామ టీడీపీ యువనాయకుడు ఇమామ్ పలకలు పంపిణీ చేశారు. నాయకులు తలారి నరేష్, శివానందారెడ్డి, గిరీష్, అశోక్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో గ్రామ దేవత పెద్దమ్మతల్లికి టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. బీసీ జనార్దనరెడ్డికి మంత్రి పదవి వచ్చిన సందర్భంగా గ్రామ టీడీపీ నేతలు మొలక రాందాస్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, నరసింహ వేణుమురళి ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో 101టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. మంత్రి బీసీ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటామని రాందాస్, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటపాడు శివరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఆదినారాయణ, ధర్మారాయుడు, శీను, హాజీ, కమ్మవారిపల్లె, లక్ష్మంపల్లి పాల్గొన్నారు.

మంత్రి బీసీకి టీడీపీ నాయకుల అభినందనలు

బనగానపల్లె: బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బీసీ జనార్దన్‌రెడ్డిని, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాట సాని చంద్రశేఖర్‌రెడ్డి గురువారం విజయవాడలో అభినందించారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విస్పష్టమైన తీర్పును రాష్ట్రంలో ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం పరుగులు పెట్టనుందన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొంది. మంత్రిపదవి చేపట్టడం బనగానపల్లె పట్టణానికే గర్వకారణ మన్నారు. కార్యక్ర మంలో ఆయనవెంట టీడీపీ నాయకులు కాట్రెడ్డ మల్లిఖార్జునరెడ్డి, వంగల పర మేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: మంత్రి పదవి దక్కించుకున్న బీసీ జనార్దన్ రెడ్డిని కొలిమిగుండ్ల మండలానికి చెందిన పలువురు నేతలు విజయవాడకు వెళ్లి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నంద్యాల జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులిప్రకాశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, ఇటి క్యాల బాలిరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, ఉలువల నరసింహుడు, కల్వటాల నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి మందా విజయ్ బీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఎమ్మార్పీస్, ఇతర కులసంఘాల నాయకులు గోపాల్‌గారి దస్తగిరి, న్యాయవాది మందా విజయ్, రామ్మోహన్, బాషా, మాల మహానాడు బుగ్గరాముడు, వాల్మీకి నేత చికెన్ వెంకటేష్‌లు బీసీని కలిసిన వారిలో ఉన్నారు.



ఆలయంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



అలిపిరి మెట్ల మార్గం వద్ద దైవదర్శనానికి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు





ముదిగేడులో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కోవెలకుంట్లలో..





బీసీ జనార్దన్‌రెడ్డిని అభినందిస్తున్న కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రి బీసీతో ఎమ్మార్పీస్ నాయకులు

డోన్‌లో అన్న క్యాంటిన్



డోన్‌లో తెరుచుకోనున్న అన్న క్యాంటిన్ ఇదే

డోన్, జూన్ 13: ఐదేళ్ల తర్వాత డోన్ పట్టణంలో అన్న క్యాంటిన్ తెరుచుకోనుంది. డోన్ పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వంలోని మధు ఫంక్షన్ హాల్ పక్కన అన్న క్యాంటిన్‌ను ఏర్పాటు చేశారు. పేదలకు రూ.5కే మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తూ వచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటిన్లను మూసివేశారు. పట్టణంలోని అన్న క్యాంటిన్‌ను మూసేసి సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. సీఎంగా చంద్రబాబు తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ క్యాంటిన్ మళ్లీ ప్రారంభం కానుంది. ఈ భవనంలో కొనసాగుతున్న సచివాలయాన్ని వేరే చోటకు మారుస్తామని మున్సిపల్ కమిషనర్ డా. జయరాం తెలిపారు.

పొదుపు సంఘాల నిర్వహణపై ఆడిట్

ఉయ్యాలవాడ, జూన్ 13: మండంలోని ఆయా గ్రామాల గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యల పనితీరుపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఆడిటర్ తన్విత్‌ఖాన్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామసమాఖ్య, మండల సమాఖ్యల రికార్డులను ఆయన పరిశీలించారు. ఆడిటర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండల సమాఖ్య ద్వారా జరిగిన లావాదేవీలను, వాటి బ్యాంక్ స్టేట్‌మెంట్లను పరిశీలించామన్నారు. అలాగే మండలంలోని 20 గ్రామైక్య సంఘాలకు వచ్చిన నిధులు, వాటి ఖర్చులకు సంబంధించిన ఓచర్లరు పరిశీలించామన్నారు. రికార్డులను పరిశీలించి రిపోర్టు తయారు చేసి తాము తయారు చేసిన ఆడిట్ రిపోర్టును జిల్లా వెలుగు పీడీ గారికి పంపుతామని ఆయన తెలిపారు. ఏపీఎం దానన్న, సీసీలు గంగన్న, నాగన్న పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల డోన్‌కు రాక

డోన్, జూన్ 13: ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుక్రవారం డోన్‌కు వస్తున్నట్లు గురువారం పార్టీ వర్గాలు తెలిపాయి. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కోట్ల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి పను లపై కూడా ఎమ్మెల్యే కోట్ల సమీక్షించనున్నారు. అదేవిధంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతోనూ ఎమ్మెల్యే కోట్ల సమావేశం కానున్నట్లు పార్టీ వర్గాలు తెలి పాయి.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి, జూన్ 13: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని మెట్టుపల్లి ఆర్బీకేలో రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏనుగమర్రి రాము, శంకర్, సూర్య నారాయణగౌడు, రైతులు పాల్గొన్నారు.

16,400 పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి ..

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 13: మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు 16,400 పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం వెల్లడించారు. ఇంకా 4300 పుస్తకాలు రావాల్సివుందని ఆయన తెలిపారు. 5వ తరగతి, 10వ తరగతి తదితర పాఠ్య పుస్తకాలు పెండింగ్ వున్నట్లు తెలిపారు. అందుబాటులో వున్న పాఠ్య పుస్తకాలను గురువారం ప్రత్యేక వాహనాల్లో పాఠశాలలకు తరలించారు.

తొలి సంతకంపై హర్షం

డోన్(రూరల్), జూన్ 13: మెగా డీఎస్సీపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం పెట్టడంపై కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగ ఉపాధ్యాయులకు తీపి కబురులాంటిదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు మెగా డీఎస్సీ పేరుతో మోసం చేసిందన్నారు.

అవుకు: నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం హర్షణీయమని నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరాముడు నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను నయవంచనకు గురి చేసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు 16,347 డీఎస్సీ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కోట్లకు మంత్రి పదవి ఇవ్వాలి

డోన్(రూరల్), జూన్ 13: ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డోన్ జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు.

కేఈ శ్యాంబాబుకు మంత్రి పదవి ఇవ్వాలి

డోన్(రూరల్), జూన్ 13: ఉమ్మడి జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం డోన్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం బాధాకర మన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెండేకంటి నగర్‌లో దొంగతనం

బనగానపల్లె, జూన్ 13: బనగానపల్లె పట్టణంలో పట్టపగలే దొంగతనాలు జరుగుతున్నాయి. బనగానపల్లె పట్టణంలోని పెండేకంటి నగర్‌లోని సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో గురువారం మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా లోని 10 తులాల బంగారును దొంగిలించుకొని వెళ్లారు. సుదర్శన్‌రెడ్డి భార్య పుట్టింటికిపోగా, సుదర్శన్‌రెడ్డి పొలం పనులు చూసుకోవడానికి వెళ్లిన సమయంలో ఈదొంగతనం జరిగినట్లు సీఐ తెలిపారు. అలాగే పట్టణంలోని బంగారమ్మ తోట సమీపంలో నివసిస్తున్న శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కూడా దొంగలు చొరపడి 30వేలు చోరీ చేసినట్లు సీఐ గంటా సుబ్బారావు పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోవెలకుంట్లలో..: కోవెలకుంట్ల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకోగా.. తాళం పగలగొట్టి ఇంట్లోనికి ప్రవేశించి 11 తులాల బంగారును దొంగలు అపహరించినట్లు గుర్తించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ జయచంద్ర, ఎస్ఐ వరప్రసాద్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దొంగలు తాళం పగులగొట్టిన బీరువా ఇదే

గ్రంథాలయ ప్రాంగణంలో మందుబాబులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న పాఠకులు

ప్యాపిలి, జూన్ 13: పట్టణంలోని గ్రంథాలయం మందుబాబుల అడ్డగా మారింది. రాత్రిపూట మందుబాబులు గ్రంథాలయం ఆవరణలోనే మద్యం సేవిస్తున్నారు. పట్టణంలో నడి ఒడ్డున గ్రంథాలయ భవనాన్ని రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. అయితే ప్రహరీ నిర్మించ లేదు. దీంతో రాత్రిపూట మందుబాబులు గ్రంథాలయం ఆవరణలోకి రోజూ వెళ్లి మద్యం సేవిస్తున్నారు. అనంతరం అక్కడే మద్యం సీసాలు, గ్లాసులు, ప్లాస్టిక్ బ్యాగ్‌లను వదిలేసి వెళ్లుతున్నారు. ఉదయం గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మందుసీసాలు కనిపిస్తున్నాయి. పోలీసులు తక్షమే స్పందించి గ్రంథాలయం ఆవరణలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.



గ్రంథాలయం ఆవరణలో వదిలేసి వెళ్లిన మద్యం సీసాలు, గ్లాసులు

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూన్ 13: చాగలమర్రి గ్రామంలోని దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన రాతిదూలం బండలాగుడు పోటీలను టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, నంద్యాల మైనార్టీ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి ప్రారంభించారు. ఈ పోటీల్లో కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలు హోరాహోరిగా సాగాయి. మొదటి ఆరు బహుమతులు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదును దాతల సహకారంతో అందజేశారు. కమిటీ సభ్యులు మౌలాలి, అనీఫ్, ఖలీల్, టీడీపీ నాయకులు నరసింహులు, జెట్టి నాగరాజు, ఖాదర్, కొలిమిసోను, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్కూలు బస్సు -ఇన్నోవా కారు ఢీ

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

కోవెలకుంట్ల, జూన్ 13: కోవెలకుంట్ల మండల పరిధిలోని భీమునిపాడు - కంపమల్లమిట్ట మధ్య ఉన్న కుందనవాగు బ్రిడ్జి వద్ద గురువారం సాయంత్రం స్కూలు బస్సు, ఇన్నోవా కారు ఢీకొన్నాయి. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూలు బస్సు సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకుని భీమునిపాడు మీదుగా కంపమల్లకు వెళుతుండగా ఆళ్లగడ్డ నుంచి యాగంటికి వెళుతున్న ఇన్నోవా కారు కుందనవాగు బ్రిడ్జి వద్ద బస్సును ఢీకొట్టింది. ఇరుకు బ్రిడ్జి కావడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే బస్సు డ్రైవరు అప్రమత్తమై సడెన్ బ్రేక్ వేసి ప్రమాదం తప్పించాడు. ఈ సంఘటనలో విద్యార్థులకు గాయాలు కాలేదు. అయితే రెండువాహనాల డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశా రు.

ముగ్గురిపై కేసు నమోదు

అవుకు జూన్ 13: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, అమర్ నాథ్ రెడ్డి ముని రంగడు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ బాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి ఎక్సకవేటర్ డ్రైవర్ మునిరంగడు కలిసి అన్నవరం గ్రామానికి వెళ్లేతారు రోడ్డును తవ్వి రాకపోకలకు ఆటంకం కలిగించినట్లు కొలిమిగుండ్ల సబ్ డివిజన్ పంచాయతీ రాజ్ ఏఈ పటాన్ ఇబ్రహీం ఖాన్ ఫిర్యాదు చేశారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఆర్ఐ రాముడు పంచాయతీ సెక్రటరీ రాజేష్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించామని అన్నారు. ఆ తర్వాత త ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు సూచనలు

దొర్నిపాడు, జూన్ 13: మండలంలోని ఆయా గ్రామాల రైతులు 2023 రబీలో సాగు చేసిన రైతులకు పంట నష్టపరిహారంపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. గురువారం వెలుగు కార్యాలయంలో వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కోవెలకుంట్ల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్, వ్యవసాయాధికారి మురళీకృష్ణ హాజరయ్యారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, జూన్ 13: కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు తిరుప తయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా రవాణా సమస్యలపై తెలుసుకునేందుకు ఉదయం 11గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

చిన్నేరుకు జలకళ



చిన్నేరు వాగులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

రుద్రవరం, జూన్ 13: మండలంలోని చందలూరు గ్రామ సమీపంలో ఉన్న చిన్నేరువాగుకు జలకళ సంతరించుకుంది. వర్షాలు కురియడంతో వర్షం నీరు చిన్నేరువాగులో చేరి ప్రవహిస్తోంది. మొన్నటి వరకు జలకళ లేని ఏర్లు, వాగులు వర్షాలు కురియడంతో జలకళ సంతరించుకుని ప్రవహిస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, జూన్ 13: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీడీపీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమైందని, ప్రజా ప్రభుత్వ పాలన వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

చాగలమర్రి, జూన్ 13: చాగలమర్రి గ్రామంలోని దస్తగిరిస్వామి ఉరుసును గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లి దర్గా వద్ద ప్రత్యేక ఫాతెహాలు చేశారు. కమిటీ సభ్యులు దస్తగిరిస్వామి జెండాను ఊరేగింపుతో తీసుకెళ్లి దర్గాలో కొలువుదీర్చారు. కమిటీ సభ్యులు మౌళాలి, అనిఫ, ఖలీల్, బావద్దీన్, శ్యాబుద్దీన్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

బనగానపల్లె, జూన్ 13: బనగానపల్లె పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులకు, కమ్యూనిటీ హెల్త్ అధికారులకు గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామనాథ్‌రావు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను గురించి దాని నివారణపై వారికి అవగాహన కల్పించారు. క్యాన్సర్ రోగికి మనోధైర్యాన్ని నింపాలన్నారు. ప్రతి రోజు క్యాన్సర్ నివారణ మందులు వాడి క్యాన్సర్‌ను నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుజాత, డీజీవో డాక్టర్ ప్రశాంతి, దంత వైద్యులు డాక్టర్ పద్మజ, టంగుటూరు వైద్య అధికారి డాక్టర్ శివశంకరుడు, డాక్టర్ మధుమౌనిక, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేయాలి'

నంద్యాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాను అభివృద్ధి చేయాలని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి(వాసు) మంత్రి టీజీ భరత్‌ను కోరారు. విజయవాడలో నూతనంగా మంత్రిగా పదవి ప్రమాణం చేసిన కర్నూలు ఎమ్మెల్యే భరత్‌ను శ్రీనివాసరెడ్డి గురువారం కలిసి అభినందించారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

బనగానపల్లె, జూన్ 13: మండలంలోని పలుకూరు గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీ గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన అంబాల రామకృష్ణారెడ్డిని గురువారం ఘనంగా సత్కరించారు. పలుకూరులోని ఆయన ఇంటి వద్ద కలుసుకొని అభినందించారు. ఈసందర్భంగా అంబాల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపుతో బనగానపల్లె నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రిగా మంచిపేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి'

రుద్రవరం, జూన్ 13: రుద్రవరం మండలంలో బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ చంద్రబాబు సూచించారు. పోలీసు స్టేసన్ ఆవరణలో గురువారం సాయంత్రం ముస్లింలతో సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లు చేయకుండా ప్రతి గ్రామంలో బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు కోట్ల పరామర్శ



వెంకటేశ్వర ఆచారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, జూన్ 13: పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వర ఆచారి అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. గురువారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని 2వ వార్డు టీడీపీ బూత్ ఇన్‌చార్జి వెంకటేశ్వర ఆచారి అనారోగ్యంతో కర్నూలు విజయదుర్గ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేరారు. విషయాన్ని తెలుసుకున్న కోట్ల అక్కడకు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్ ఉన్నారు.

20 నుంచి ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 13: మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు 2024-25 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమితితో బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో గంటా వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. బోయలకుంట్ల గ్రామంలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రామేశ్వర, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 25.26 ఎకరాలకు, అనంత పద్మనాభ స్వామి దేవస్థానానికి చెందిన 11.62 ఎకరాలకు, ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 11.44 ఎకరాలకు, వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 11.89 ఎకరాలకు, నరసింహస్వామి ఆలయానికి చెందిన 5.94 ఎకరాలకు వేలంపాట నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే కోటపాడు గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 38.27 ఎకరాలకు, కేశవ స్వామి ఆలయానికి చెందిన 45.58 ఎకరాల భూములకు ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి వెల్లడించారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

ఉయ్యాలవాడ, జూన్ 13: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పుస్తకాలు అందించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 22,000 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 16,314 పుస్తకాలు వచ్చాయని చెప్పారు. ఒకటి, రెండు, మూడు, ఆరు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు సంబంధించిన అన్ని పుస్తకాలు వచ్చాయని ఆయన తెలిపారు. నాలుగు, ఐదు, ఏడు, పది తరగతుల పుస్తకాలు ఇంకొన్ని రావాల్సి ఉందని చెప్పారు. బ్యాగులు, యూనిఫామ్, షూ రావలసి ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు అందజేసినట్లు ఎంఈవో రామచంద్రయ్య తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లో పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, సీఆర్పీలు ఉన్నారు.

గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా మార్చాలి

బేతంచెర్ల, జూన్ 13: మండలంలోని గూటుపల్లె చెరువును హంద్రీనీవా సుజల స్రవంతి నీటి పథకం ద్వారా నింపి రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ రైతు సంఘం సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం మండల కార్యదర్శి అంబాపురం రామ్మోహన్ ఆధ్వర్యంలో అంబాపురం, రంగాపురం, గూటుపల్లె గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ బేతంచెర్ల మండల పరిధిలో గూటుపల్లి, గోర్లగుట్ల చెరువు పరిధిలో నీటిని నిల్వ చేస్తే దాదాపు పది గ్రామాలకు పైగా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకం ద్వారా 77 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీరు నింపే కార్యక్రమం చేపట్టిదని, అయితే గూటుపల్లి, గోర్లగుట్ల చెరువులను ఇందులో చేర్చలేకపోడం చాలా బాధాకరమని అన్నారు. గూటుపల్లె చెరువు ఇప్పటికే దాదాపు 100 ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడు నీలి వెంకట కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, మధుశేఖర్, బాబు సామేబ్, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.